

ప్రతిభకు పట్టం

ప్రతిభ ఆధారంగా పేద విద్యార్థులకు కార్పొరేట్ జూనియర్ కళాశాలల్లో ప్రవేశాలు కల్పించేందుకు దరఖాస్తుల స్వీకరణ కొనసాగుతోంది. 8లో



పత్తి సాగుకు పదునే అదును

ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో పత్తి విత్తనాలు నాటకుండా సరైన సమయం వచ్చే వరకు ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. 8లో

గరిష్టం / కనిష్టం
38° / 27°

వాతావరణం

జిల్లాలో బుధవారం ఉదయం సాధారణ ఉష్ణోగ్రతలే ఉంటాయి. మధ్యాహ్నానికి మాత్రం ఎండ పెరుగుతుంది.

న్యూస్‌రీల్

24నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు



సమావేశంలో మాట్లాడుతున్న డీఐఈఓ రవిబాబు

ఖమ్మం సహకారనగర్: ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు ఈనెల 24వ తేదీ నుంచి జూన్ 3వ తేదీ వరకు జరగనున్నాయని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కె.రవిబాబు తెలిపారు. ఖమ్మంలోని నయాబజార్ జూనియర్ కళాశాలలో మంగళవారం ఆయన చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు, కస్టోడియన్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా డీఐఈఓ మాట్లాడుతూ జిల్లాలో 42 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రథమ సంవత్సరం పరీక్షలకు 10,352, ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 4,632మంది విద్యార్థులు హాజరుకానుండగా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈసమాశంలో డీఈసీ సభ్యులు హెచ్.వెంకటేశ్వరరావు, బి.వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

వచ్చేనెల 3నుంచి ఎస్సెస్సీ...

వచ్చేనెల 3వ తేదీ నుంచి ఎస్సెస్సీ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభమవుతాయని డీఈఓ సోమశేఖరశర్మ మంగళవారం ఓ ప్రకటనలో తెలి పారు. జూన్ 3న మొదటిభాష, 5న ద్వితీయ భాష, 6న ఇంగ్లిష్, 7న గణితం, 8న ఫిజికల్ సైన్స్, 11న సోషల్ పరీక్ష ఉంటుందని వెల్లడించారు. పరీక్ష తేదీకి రెండు రోజుల ముందు వరకు ఆలస్య రుసుము రూ.50తో పరీక్ష ఫీజు చెల్లించే వెసలుబాటు ఉందని ఆయన తెలిపారు.

శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

ఖమ్మం సహకారనగర్: మార్చి 2019లో ఇంటర్మీడియట్ ఎంఎల్‌టీ ఒకేషనల్ కోర్సులో ఉత్తీర్ణులైన విద్యార్థులు ఏడాది పాటు క్లినికల్ శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కె.రవిబాబు సూచించారు. మధిర, సత్తుపల్లి ఏరియా ఆస్పత్రులతో పాటు కల్లూరు, పెనుబల్లి సీహెచ్‌సీల్లో సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. అభ్యర్థులు బయోడేటా, రూ.10పోస్టల్ స్టాంప్ అతికించిన సొంత చిరునామా కవర్, సర్టిఫికెట్ల జిరాక్స్‌లు జత చేసిన దరఖాస్తులను జూన్ 1వ తేదీ సాయంత్రం 5గంటల్లోపు కలెక్టరేట్‌లోని తమ కార్యాలయంలో అందజేయాలని పేర్కొన్నారు. శిక్షణకు ఎంపికైన విద్యార్థులు రూ.వెయ్యి డీడీ చెల్లించాల్సి ఉంటుందని, గతంలో దరఖాస్తు చేసుకుని ఎంపిక కాని వారు కూడా మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

24న పాలిసెట్

జిల్లాలో ఐదు పరీక్ష కేంద్రాలు



ఖమ్మం సహకారనగర్: ప్రభుత్వ, ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలల్లో మూడేళ్ల ఇంజనీరింగ్, నాన్ ఇంజనీరింగ్, డిప్లొమా కోర్సులతో పాటు వ్యవసాయ, వెటర్నరీ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు ఈనెల 24న పాలిసెట్ నిర్వహించనున్నారు. ఉదయం 11నుంచి మధ్యాహ్నం 1–30గంటల వరకు పరీక్ష జరగనుండగా, విద్యార్థులను ఉదయం 10గంటల నుంచే కేంద్రాల్లోకి అనుమతిస్తారు. జిల్లాలోని ఐదు పరీక్షా కేంద్రాల్లో 2,591 మంది విద్యార్థులు హాజరుకానుండగా ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కోఆర్డినేటర్ జకీరుల్లా తెలిపారు. ఖమ్మంలోని ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాలలో 940మంది, ఎస్‌బిటీలో 408, కవిత మెమోరియల్ డిగ్రీ కళాశాలలో 650, డీఆర్ఎస్ డిగ్రీ కళాశాలలో 446, బొమ్మ ఇంజనీరింగ్ కళాశాలలో 147మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారని వెల్లడించారు. కాగా, పరీక్ష ప్రారంభమైన తర్వాత నిమిషం ఆలస్యమైనా అనుమతి ఉండదని, హెచ్‌బీ పెన్సిల్, ఎరేజర్, షార్ప్‌నర్, బ్లూ లేదా బ్లాక్ పెన్ తెచ్చుకోవాలని, హాల్‌టికెట్‌పై ఫొటో ప్రింట్ కాకపోతే ఒక పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, ఆధార్ కార్డు వెంట తెచ్చుకోవాలని సూచించారు.

నేత్రపర్వంగా రామయ్య నిత్య కల్యాణం

భద్రాచలం : భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారి నిత్య కల్యాణ వేడుక మంగళవారం నేత్రపర్వంగా సాగింది. అర్చకులు తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం జరిపించారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. మంగళవారాన్ని పురస్కరించుకుని అభయాంజనేయస్వామి వారికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేయగా భక్తులు దర్శించుకున్నారు.

పోటా.. పోటీ



వరంగల్ – నల్లగొండ – ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ ఎన్నికల ప్రచారం జోరందుకుంది. ఇటీవలే లోక్‌సభ ఎన్నికలు ముగియడంతో పూర్తిస్థాయిలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంపై పార్టీలు దృష్టి సారించాయి. రాజకీయ పార్టీలు గతంలో కన్నా ఎక్కువగా ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకోగా.. ఉమ్మడి జిల్లాలో ఆయా పార్టీల ప్రచారం హోరాహోరీగా సాగుతోంది. ఈనెల 27న పోలింగ్ జరగనుండగా, ఇందుకు ఐదు రోజుల సమయమే ఉండడంతో ప్రచారంలో స్పీడ్ పెంచాయి. బీఆర్ఎస్ అభ్యర్థి తరఫున ఖమ్మం, ఇల్లెందు, కొత్తగూడెంలో సోమవారం మాజీ మంత్రి కేటీఆర్, బీజేపీ అభ్యర్థి తరఫున ఆ పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యులు ఈటల రాజేందర్ ఖమ్మంలో ప్రచారం నిర్వహించారు. ఇక మంగళవారం కాంగ్రెస్ అభ్యర్థి తరఫున రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు పాలేరు, ఖమ్మం నియోజకవర్గాల సన్నాహక సమావేశాల్లో పాల్గొన్నారు.

– సాక్షి ప్రతినిధి, ఖమ్మం

ఎమ్మెల్సీ ఎన్నికలపై పార్టీల నజర్

- ఉమ్మడి జిల్లాలో విస్తృతంగా ప్రచారం
- కాంగ్రెస్ అభ్యర్థి తరఫున మంత్రులు పొంగులేటి, తుమ్మల
- బీఆర్ఎస్ నుంచి మాజీ మంత్రి కేటీఆర్, ఎంపీ వద్దిరాజు, ఎమ్మెల్సీ మధు
- బీజేపీ ఆధ్వర్యాన భేటీలు.. కేడర్‌కు ఈటల దిశానిర్దేశం
- పోలింగ్ సమీపిస్తుండడంతో జోరుగా అభ్యర్థుల పర్యటనలు

కాంగ్రెస్ వ్యూహాత్మకంగా..

కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లోని వివిధ ప్రాంతాల్లో నాయకులతో కలిసి ప్రచార సమావేశాలకు హాజరయ్యారు. మరోవైపు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపు కోసం ఉమ్మడి జిల్లాలో ఇన్‌చార్జిలు, కో ఆర్డినేటర్లను నియమించారు.



మరో ఐదు రోజులే..

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక పోలింగ్‌కు ఐదు రోజుల సమయమే ఉంది. ఈ నియోజకవర్గానికి 2021లో ఎన్నికలు జరగ్గా.. బీఆర్ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వరరెడ్డి గెలుపొందారు. ఆ తర్వాత ఆయన జనగామ ఎమ్మెల్యేగా ఎన్నికవడంతో ఉప ఎన్నిక జరుగుతోంది. ఈనెల 27న ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్, వచ్చే నెల 5న లెక్కింపు జరగనున్నాయి. ప్రచారానికి సమయం తక్కువగా ఉండడంతో పోటీలో ఉన్న కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ అభ్యర్థులు తీన్మార్ మల్లన్న, ఏనుగుల రాకేష్‌రెడ్డి, గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి ప్రచారం చేపట్టారు. ఈ నియోజకవర్గం మూడు ఉమ్మడి జిల్లాల్లో విస్తరించి ఉండడంతో కొద్దిరోజులుగా వీరు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు.

అభ్యర్థి తరఫున రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు మంగళవారం పాలేరు, ఖమ్మం నియోజకవర్గ స్థాయి పట్టభద్రుల సమావేశాలకు హాజరై మల్లన్నను గెలిపించాలని కోరారు.

బీఆర్ఎస్ విస్తృత ప్రచారం

బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేష్‌రెడ్డి కొద్దిరోజులుగా ఉమ్మడి జిల్లాను చుట్టేస్తున్నారు. గతంలోనే బీఆర్ఎస్ నాయకులతో కలిసి సన్నాహక సమావేశాల్లో పాల్గొంటూనే, రెండు జిల్లాల్లో పట్టభద్రులను కలుస్తున్నారు. మాజీ మంత్రి కేటీఆర్ సైతం సోమవారం ఖమ్మం, కొత్తగూడెం, ఇల్లెందులో పర్యటించి రాకేష్‌రెడ్డిని గెలిపించాలని పిలుపునిచ్చారు. ప్రచారంలో నాగర్‌కర్నూల్, ఖమ్మం ఎంపీ అభ్యర్థులు ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్, నామా నాగేశ్వరరావు, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. నల్లగొండ, వరంగల్‌తోపాటు ఉమ్మడి ఖమ్మం జిల్లాపై బీఆర్ఎస్ అభ్యర్థి ప్రత్యేక దృష్టి సారించి ప్రచారం చేపట్టారు.

గుజ్జుల తరఫున ఈటల

బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి సైతం ఉమ్మడి ఖమ్మం జిల్లాపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. గత కొద్దిరోజులుగా ఇక్కడే మకాం వేసి ప్రచారం నిర్వహిస్తున్నారు. బీజేపీ లోక్‌సభ అభ్యర్థి తాండ్ర వినోద్ రావు, జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ, ఇతర నాయకులు అభ్యర్థితో కలిసి ప్రచారంలో పాల్గొంటున్నారు. అలాగే మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు ఉమ్మడి జిల్లాలో ప్రచారం చేశారు. బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఈటల రాజేందర్ సైతం సోమవారం ఖమ్మంలో జరిగిన ప్రచారానికి హాజరయ్యారు.

ప్రశ్నించే గొంతుకు పట్టం కట్టండి

- బీఆర్ఎస్, బీజేపీలకు ఓటు అడిగే హక్కు లేదు
- రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాసరెడ్డి, పక్కన నాయకులు

కూసుమంచి: నల్లగొండ – ఖమ్మం – వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థి తీన్మార్ మల్లన్నను గెలిపించాలని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచారశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కోరారు. అయితే, ఆయన భారీ మెజార్టీతో గెలవడం ఇప్పటికే ఖాయమైందని ధీమా వ్యక్తం చేశారు. ఖమ్మం రూరల్ మండలంలో మంగళవారం నిర్వహించిన పాలేరు నియోజకవర్గ స్థాయి పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి మాట్లాడారు. బీఆర్ఎస్ కారణంగా ఈ ఉప ఎన్నిక వచ్చిందని, గతంలో అధికారాన్ని అడ్డుపెట్టుకుని మాజీ సీఎం కేసీఆర్ తీన్మార్ మల్లన్నను తీవ్రంగా హింసించారని తెలిపారు. దీంతో అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు బీఆర్ఎస్‌కు గుణపాఠం చెప్పారన్నారు. ఈసారి తీన్మార్ మల్లన్నను గెలిపించాలని.. మాయమాటలతో లబ్ధి పొందాలని చూస్తున్న బీఆర్ఎస్, బీజేపీ పార్టీలను నమ్మొద్దని కోరారు. కాగా, త్వరలో వెలువడనున్న లోక్‌సభ ఎన్నికల ఫలితాలతో బీజేపీ పని అయిపోతుందని, బీఆర్ఎస్ పరిస్థితీ అలాగే ఉంటుందని మంత్రి తెలిపారు. అనంతరం అభ్యర్థి తీన్మార్ మల్లన్న మాట్లాడగా లోక్‌సభ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి, ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జి రఘునాథ్‌యాదవ్, జెడ్పీటీసీ సభ్యుడు బెల్లం శ్రీనివాస్, ఎంపీపీ బోడ మంగీలాల్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, నాయకులు మువ్వా విజయ్‌బాబు, రాయల నాగేశ్వరరావు, బాలసాని లక్ష్మీనారాయణ, మద్దినేని బేబీ స్వర్ణకుమారి, క్లైం వెంకటరెడ్డి, చావా శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఈసారి గెలుపు ఖాయం..

రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మంవన్‌టౌన్: పదేళ్లుగా ప్రజాసమస్యలపై తీన్మార్ మల్లన్న పోరాడుతున్నారని, ఆయన గొంతు ఎప్పటికీ ప్రశ్నిస్తూనే ఉంటుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఖమ్మంలో మంగళవారం నిర్వహించిన నియోజకవర్గ స్థాయి సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఎన్నికల్లో తీన్మార్ మల్లన్న సాంకేతికంగా ఓడిపోయినా, ఈసారి గెలవడం ఖాయమని తెలిపారు. తాజాగా జరిగిన రాష్ట్ర కేబినెట్ సమావేశంలో అందరికీ సన్న బియ్యం ఇవ్వాలని, ఆ ధాన్యం పండించిన రైతులకు బోనస్ ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిపారు. అయితే, అప్పుల కుప్పగా రాష్ట్రాన్ని అప్పగించిన బీఆర్ఎస్ నేతలు తమ ప్రభుత్వంపై తప్పుడు విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. అనంతరం అభ్యర్థి తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ తనపై కేసులు ఉన్నప్పటికీ.. అవన్నీ ప్రజా సమస్యలపై పోరాడితే గత ప్రభుత్వం పెట్టినవేనని తెలిపారు. తొలుత డీసీసీ కార్యాలయంలో జరిగిన మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతి సమావేశంలో మంత్రి తుమ్మల, నాయకులు పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రపంచ దేశాలు భారత్ వైపు చూడడానికి రాజీవ్‌గాంధీ దార్శనికతే కారణమని తెలిపారు. ఈ సమావేశాల్లో లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మేయర్ పునుకొల్లు నీరజతో పాటు బాలసాని లక్ష్మీనారాయణ, మహ్మద్ జావేద్, నూకల నరేష్‌రెడ్డి, యర్రం బాల గంగాధర్‌తిలక్, మువ్వా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

చెరువు మట్టి.. కొల్లగొట్టి



ఖమ్మం గొల్లగూడెం చెరువు నుంచి టిప్పర్ల ద్వారా తరలిస్తున్న చెరువు మట్టి

- అనుమతి పేరుతో అడ్డగోలుగా తవ్వకాలు
- రాత్రి వేళ సైతం అక్రమంగా తరలింపు
- మైనింగ్ కట్టడితో అందరూ ఇటే..

ఖమ్మంఅర్బన్ : గ్రామాల్లోని చెరువుల్లో మట్టి తవ్వి.. రైతులు పొలాల్లో పోసుకునేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. అయితే జిల్లాలోని పలు ప్రాంతాల్లో రైతుల కంటే వ్యాపారులే ఎక్కువగా మట్టి తరలిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లాలో ప్రస్తుతం మూడు మైనింగ్ క్వారీలకు మాత్రమే మట్టి తవ్వకాలకు అనుమతులు ఉన్నాయి. అంతేకాక చెరువులు, గుట్టల నుంచి మట్టి తవ్వకాలపై నిఘా ఉండడం.. వెంచర్లు, గృహ నిర్మాణాలు తదితర అవసరాలకు మట్టి అవసరం కావడంతో పొలాలకు తరలించాల్సిన చెరువు మట్టిని అడ్డదారుల్లో వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్నారు.

అడ్డుకున్నా ఆగని దందా..

చెరువుల్లో మట్టి తవ్వకాల ద్వారా నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుందని భావించిన అధికారులు తవ్వకాలు, తరలింపునకు అనుమతులు మంజూరు చేశారు. అయితే చెరువుల రూపం దెబ్బతినకుండా సమాంతరంగా తవ్వాలని నిబంధన విధించారు. ఈ విషయమై జలవనరులు, వ్యవసాయ శాఖ అధికారులతో సమావేశమైన కలెక్టర్ వీ.పీ.గౌతమ్ సూచనలు చేశారు. మట్టిని పొలాల్లో పోస్తే భూసారం పెరగనున్నందున రైతులు ముందుకొస్తే అనుమతి ఇవ్వాలని తెలిపారు. దీంతో జలవనరుల శాఖ అధికారులు 29 చెరువుల్లో తవ్వకాలకు అనుమతులు ఇచ్చారు. ఇదేసమయాన జాతీయ రహదారుల నిర్మాణం, ఇతర వాణిజ్య అవసరాలకు మట్టి తరలిస్తే మాత్రం నిబంధనల మేరకు ప్రభుత్వానికి డీడీ రూపంలో తగిన రుసుము చెల్లించాలని, తవ్వకాలు ఉదయం 6నుంచి సాయంత్రం 6గంటల వరకు మాత్రమే చేపట్టాలని స్పష్టం చేశారు. అయితే అనేక ప్రాంతాల్లో రాత్రివేళల్లో కూడా తవ్వుతూ అక్రమంగా తరలిస్తున్నారు. ఇటీవల ఓ చోట జలవనరుల శాఖ ఈఈ అనన్య, డీఈ ఉదయ్‌ప్రతాప్, వర్క్ ఇన్‌స్పెక్టర్ ఉపేందర్ వాహనాలను అడ్డుకుని పోలీసులకు ఫిర్యాదు చేసినా దందా ఆగడం లేదు.

పగటి వేళ మాత్రమే అనుమతి

చెరువుల్లో మట్టి తవ్వకాలకు ఉదయం 6నుంచి సాయంత్రం 6 గంటల వరకే అనుమతి ఇస్తున్నాం. ఇటీవల గొల్లగూడెం చెరువులో అర్ధరాత్రి తవ్వుతున్నారనే సమాచారంతో తనిఖీ చేశాం. మట్టి తరలిస్తున్న వారు పరారవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాం. చెరువు మట్టిని రైతులకు ఉచితంగా, ఇతర అవసరాల కోసమైతే డీడీ చెల్లిస్తే అనుమతి ఇస్తున్నాం. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

– అనన్య, జల వనరులశాఖ ఈఈ, ఖమ్మం

రైతులకు ఇబ్బందులు రానివ్వొద్దు

- ఎక్కడా తాగునీటి సమస్య రాకుండా చూడాలి
- ఉమ్మడి జిల్లా ప్రత్యేకాధికారి సురేంద్రమోహన్





వైరా కొనుగోలు కేంద్రంలో రైతులతో మాట్లాడుతున్న సురేంద్రమోహన్ (ఇన్‌సెట్) కలెక్టరేట్‌లో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి సురేంద్రమోహన్, పక్కన కలెక్టర్

ఖమ్మం సహకారనగర్: జిల్లాలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు ఇబ్బంది పడకుండా పర్యవేక్షించాలని ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారి, రాష్ట్ర గనులు, భూగర్భ శాఖల కార్యదర్శి సురేంద్రమోహన్ సూచించారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఆయన కలెక్టర్ వీ.పీ.గౌతమ్‌తో కలిసి ధాన్యం కొనుగోళ్లు, తాగునీటి సరఫరా, అమ్మ ఆదర్శ పాఠశాలల్లో పనులు, భూగర్భ శాఖల లక్ష్యాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా సురేంద్రమోహన్ మాట్లాడుతూ యాసంగి ధాన్యం దిగుబడి అంచనా మేరకు కొనుగోలు కేంద్రాలను కొనసాగించాలని, వర్షాల దృష్ట్యా ధాన్యం తడవకుండా చూడాలని సూచించారు. అలాగే, జిల్లాలో తాగునీటి సరఫరాలో ఇక్కట్లు రాకుండా ముందస్తు చర్యలు చేపట్టిన కలెక్టర్, అదనపు కలెక్టర్, అధికారులను అభినందించారు. పాలేరు, వైరా రిజర్వాయర్లలో జూలై వరకు సరిపడా నీరు అందుబాటులో ఉన్నందున సాఫీగా సరఫరా జరిగేలా పర్యవేక్షించాలని తెలిపారు. కాగా, అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ద్వారా జరుగుతున్న పనులన్నీ జూన్ 10లోగా పూర్తయ్యేలా చూడాలని, అక్రమ ఇసుక రవాణాను పకడ్బందీగా నియంత్రించాలని ఆదేశించారు. అనంతరం కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు 20 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని, మిల్లర్లు, వ్యాపారులు కనీస మద్దతు ధర కంటే ఎక్కువగా చెల్లిస్తుండడంతో కేంద్రాలకు తక్కువగా ధాన్యం వస్తోందని తెలిపారు. ఇక అమ్మ ఆదర్శ పాఠశాలల కింద 226 పాఠశాలల్లో పనులు పూర్తి కాగా, 425 పాఠశాలల్లో పురోగతిలో ఉన్నాయని చెప్పారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు బి.సత్యప్రసాద్, డి.మధుసూదన్ నాయక్, వివిధ శాఖల అధికారులు విజయనిర్మల, చందన్‌కుమార్, సయ్యద్ ఖుర్షీద్, ఆఫ్రిన్ సిద్ధిఖీ, అలీమ్, శ్రీలత, సదాశివకుమార్, పుష్పలత, వాణిశ్రీ, సరిత, నూరుద్దీన్, రంగప్రసాద్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన

వైరా: వైరా వ్యవసాయ మార్కెట్‌లో డీసీఎంఎస్ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఉమ్మడి జిల్లా ప్రత్యేకాధికారి పి.సురేంద్ర మోహన్ పరిశీలించారు. అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్, సివిల్ సప్లయీస్ డీఎం కె.శ్రీలత, డీఎస్ఓ చందన్‌కుమార్‌తో కలిసి కేంద్రాన్ని పరిశీలించిన ఆయన రైతులతో మాట్లాడి వసతులపై ఆరా తీశారు. కాగా, సన్న రకం ధాన్యానికి ఎక్కువ ధర చెల్లించాలని, కొర్రీలు పెట్టకుండా మిల్లర్లు కొనుగోలు చేసేలా చూడాలని రైతులు కోరారు. కాగా, సురేంద్రమోహన్ కొణిజర్లలోని విజయలక్ష్మి పారా బాయిల్డ్ రైస్ మిల్లును సైతం తనిఖీ చేసి ఒప్పందం మేరకు సీఎంఆర్ అందించాలని సూచించారు.

యూనిఫామ్ రెడీ...

- బడి తెరిచే నాటికి అందించేలా ప్రణాళిక
- ఇప్పటికే మండలాలకు చేరిన క్లాత్
- తొలుత జత.. ఆపై రెండో జత పంపిణీ
- జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో 76,875మంది విద్యార్థులు



ప్రభుత్వం విడుదల చేసిన యూనిఫామ్ మోడళ్లు



యూనిఫామ్ కుడుతున్న మహిళలు

ఖమ్మం సహకారనగర్: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు యూనిఫామ్ సిద్ధమవుతోంది. గత కొన్నేళ్లుగా ప్రభుత్వమే విద్యార్థులకు అవసరమైన యూనిఫామ్ అందిస్తుండగా పలుమార్లు విద్యాసంవత్సరం ప్రారంభమయ్యాక కొన్నాళ్లకు ఇచ్చేవారు. కానీ ఈసారి బడి తెరిచిన తొలిరోజే ఒక జత ఇచ్చేలా కార్యాచరణ రూపొందించారు.

మండలాలకు పంపిణీ

జిల్లాలో 1,211 ప్రభుత్వ పాఠశాలలు, కేజీబీవీలు, మోడల్ స్కూళ్లు, రెసిడెన్షియల్ పాఠశాలలు, గిరిజన సంక్షేమ శాఖ పాఠశాలలే కాక ఎయిడెడ్ స్కూళ్లు ఉండగా ఇందులో 76,875మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరిలో బాలురు 37,396, బాలికలు 39,479మంది ఉన్నారు. వీరందరికీ ఒక జత యూనిఫామ్‌కు అవసరమయ్యే క్లాత్ 1,63,281 మీటర్లు జిల్లాకు చేరుకోగా, మండల కేంద్రాలకు పంపించారు. అక్కడ ఏర్పాటుచేసిన మహిళాశక్తి కుట్టు శిక్షణ కేంద్రాల్లో దుస్తులు కుడుతున్నారు. ప్రతీ విద్యార్థికి రెండు జతల యూనిఫామ్ ఇవ్వనుండగా, తొలిరోజే ఒక జత పంపిణీ చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు.

ప్రత్యేకంగా డిజైన్లు

విద్యార్థుల్లో బాలురు, బాలికలకు సంబంధించిన యూనిఫామ్‌పై విద్యాశాఖ మార్గదర్శకాలు జారీ చేసింది. ఒకటి నుంచి మూడో తరగతి వరకు బాలికలకు బాడీ ఫ్రాక్, షర్ట్ ఇస్తారు. షర్ట్‌కు చేతులకు ఒక ఇంచు పట్టీలు పెట్టాలి. ఇక 4, 5వ తరగతుల బాలికలకు స్కర్ట్, స్కర్ట్‌కు రెండు ఇంచుల వెడల్పుతో ఎదురుకుచ్చిళ్లు, రెండు ఇంచుల వెడల్పుతో నూటింగ్ క్లాత్, షర్ట్‌కు రెండు జేబులు ఉండాలి. అలాగే, 6నుంచి 12వ తరగతుల బాలికలకు పంజాబీ డ్రెస్‌లు కుట్టిస్తారు. ఇక బాలురలో 1నుంచి 12వ తరగతుల బాలురకు మాత్రం షర్ట్, ప్యాంట్/నిక్కర్ కుట్టాల్సి ఉంటుంది. చొక్కా రెండు జేబులకు పట్టీలు, ప్యాంట్ నిక్కర్ గతంలో మాదిరిగానే కుట్టాలని సూచించారు. ఒక్కో యూనిఫామ్ కుట్టినందుకు రూ.50చొప్పున చెల్లిస్తారు.

అంతా ఏపీపీఎస్ ఆధ్వర్యంలో..

యూనిఫామ్ కుట్టేందుకు అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ(ఏపీపీసీఎస్)లు, డీఆర్‌డీఏ ఆధ్వర్యాన 839 స్వయం సహాయక సంఘాలను ఎంపిక చేశారు. ఇక మున్సిపాలిటీల పరిధిలో మెప్మా ఆధ్వర్యాన 203గ్రూప్‌లను ఎంపిక చేశారు. వీటి ఆధ్వర్యంలో యూనిఫామ్ కుట్టాక పాఠశాలలు తెరిచేరోజునే విద్యార్థులకు అందిస్తారు. ఆతర్వాత విద్యార్థులకు రెండో జత యూనిఫాం కూడా ఇవ్వనున్నారు. ఇందుకోసం గతేడాది చివరిలోనే విద్యార్థుల సంఖ్య ఆధారంగా కొలతలు సేకరించి, అందుకు అవసరమైన క్లాత్‌ను విద్యాశాఖ సమకూర్చింది.

యూనిఫాం సిద్ధమవుతోంది.



యూనిఫాం క్లాత్‌ను మండల కేంద్రాలకు పంపించాం. మహిళా కుట్టు కేంద్రాల్లో సిద్ధమయ్యే యూనిఫాంను హెచ్ఎంలు, అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలు, ఇన్‌చార్జ్‌లు పర్యవేక్షిస్తున్నారు.

– రాజశేఖర్, కమ్యూనిటీ మొబిలైజేషన్ ఆఫీసర్

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి టోర్నీలో పతకాలు


క్రీడాకారులతో డీవైఎస్ఓ, కోచ్

ఖమ్మం స్పోర్ట్స్: నిజామాబాద్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి జూనియర్ ఉషూ పోటీల్లో జిల్లా క్రీడాకారులు ప్రతిభ చాటారు. ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో శిక్షణ తీసుకుంటున్న ఈ.విష్ణువర్ధన్ ప్రథమ స్థానంలో నిలిచి స్వర్ణ పతకం, స్వాతినాయుడు రజత పతకం కైవసం చేసుకున్నారు. క్రీడాకారులను డీవైఎస్ఓ టి సునీల్‌కుమార్‌రెడ్డి, కోచ్ పరిపూర్ణాచారి తదితరులు అభినందించారు.

26న జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు

ఖమ్మం స్పోర్ట్స్: ఖమ్మంలోని పటేల్ స్టేడియంలో జిల్లాస్థాయి బాలబాలికల అథ్లెటిక్స్ ఎంపిక పోటీలను ఈనెల 26న నిర్వహిస్తున్నట్లు అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మందుల వెంకటేశ్వర్లు, ఎం.డీ.షఫీక్ అహ్మద్ తెలిపారు. అండర్ – 8, 10, 12, 14, 15, 18, 20, పురుషులు, మహిళల విభాగాల్లో పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు వయస్సు ధృవీకరణ పత్రాలతో ఉదయం 8గంటలకు హాజరు కావాలని సూచించారు.

ఐటీఐల్లో ప్రవేశానికి దరఖాస్తులు

ఖమ్మంసహకారనగర్: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో ప్రవేశానికి పదో తరగతి ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఖమ్మం ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్, కన్వీనర్ ఎ.శ్రీనివాసరావు సూచించారు. జూన్ 10వ తేదీ వరకు అన్ని ఒరిజినల్ ధృవపత్రాలను అప్‌లోడ్ చేసి, రూ.100 ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన తెలిపారు.

జైలు నుంచి విడుదలైన ఎన్డీ నేత అశోక్


విడుదలైన అశోక్‌తో ఎన్డీ నాయకులు

ఇల్లెందు: న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి అశోక్ అలియాస్ కుర్సం వజ్జయ్య మంగళవారం ఖమ్మం జైలు నుంచి విడుదలయ్యారు. సీపీఐ (ఎంఎల్) పేరుతో అనేక వర్గాలు ఉండగా.. రాష్ట్ర కార్యదర్శి స్థాయి వరకు ఎదిగిన ఎన్డీ చంద్రన్న వర్గం నేత అశోక్‌ను కొన్నాళ్ల కిందట పోలీసులు అరెస్ట్ చేశారు. ఆయన అరెస్టు తర్వాత పార్టీ సంక్షోభంలో కూరుకుపోగా, చంద్రన్నతో ఏపీలో తలెత్తిన విభేదాలు, గుంటూరు జిల్లాలో నాయకుడు బ్రహ్మయ్య హత్యతో ఆ వర్గం చీలిపోయింది. దీంతో సాధినేని వెంకటేశ్వరరావును రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నుకున్నారు. అయితే అశోక్ విడుదలైన నేపథ్యాన చంద్రన్న, వెంకటేశ్వరరావు వర్గాల్లో ఎవరి వెంట పయనిస్తాడో తేలాల్సి ఉంది. కాగా, అశోక్ జైలు నుంచి విడుదలైన సందర్భంగా రెండు వర్గాల నాయకులు ఆయనను కలిశారు.

మార్ఫింగ్ ఫొటోలతో వేధిస్తున్నారని ఫిర్యాదు

ఖమ్మం మామిళ్లగూడెం: తప్పుడు వివరాలతో ఇన్‌స్ట్రాగామ్ ఖాతా తెరిచి ఇతరులకు మార్ఫింగ్ ఫొటోలు పంపిస్తూ తనను వేధిస్తున్నారని డిగ్రీ విద్యార్థిని ఒకరు పోలీస్ కమిషనర్ సునీల్ దత్‌కు మంగళవారం ఫిర్యాదు చేసింది. జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ కళాశాలలో డిగ్రీ చదువుతున్న తన పేరిట గుర్తు తెలియని వ్యక్తులు ఇన్‌స్ట్రాగామ్ ఖాతా తెరిచారని ఫిర్యాదులో వెల్లడించింది. ఆపై తన ముఖంతో మార్ఫింగ్ చేసిన అసభ్యకర చిత్రాలను కుటుంబ సభ్యులకు పంపిస్తుండగా సైబర్ క్రైమ్ పోలీస్‌స్టేషన్‌లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసినా ఎలాంటు చర్యలు తీసుకోలేదని వాపోయింది. ఈమేరకు విచారణ జరిపించాలని కోరుతూ సీపీకి ఆమె వినతిపత్రం అందజేసింది.

చిట్టీల పేరుతో మోసం చేసిన వ్యక్తి అరెస్ట్

ఖమ్మం క్రైం: చిట్టీల పేరుతో పలువురిని మోసం చేశాడంటూ అందిన ఫిర్యాదుతో ఓ వ్యక్తి ఖమ్మం టూ టౌన్ పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. సీఐ బాలకృష్ణ తెలిపిన వివరాలు... ఖమ్మం కొత్తూరుకు చెందిన గొని నర్సింహారావు ప్రైవేట్ చిట్టీలు నిర్వహించగా పలువురు డబ్బులు చెల్లించారు. అయితే, కోవిడ్ సమయాన డబ్బు చెల్లించలేనని చెబుతూ కుటుంబ ఆస్తులు అమ్మి ఇస్తానని హామీ ఇచ్చాడు. ఆపై ధరణి వెబ్‌సైట్ సమస్య వచ్చిందని వాయిదా వేస్తూ కుటుంబంతో సహా కానరాకుండా పోయాడు. ఆతర్వాత పత్తి వ్యాపారంలో నష్టం వచ్చిందని రూ.1.11కోట్లకు కోర్టులో ఐపీ దాఖలు చేశాడు. కానీ గొని నర్సింహారావకు కొత్తగూడెంలో ఆస్తులు ఉన్నా కావాలనే మోసం చేస్తున్నాడని, ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉన్నాడని గోడ నర్సింహారావు తదితరులు 2021 డిసెంబర్‌లో పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో గొని నర్సింహారావు, ఆయన తండ్రి మనోహర్, సోదరుడు ఉపేందర్‌పై కేసు నమోదు చేసి, సోమవారం నర్సింహారావును అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించామని సీఐ తెలిపారు.

ప్రతిభకు పట్టం



పేద విద్యార్థులకు ప్రభుత్వం కార్పొరేట్ విద్యను అందుబాటులోకి తీసుకొస్తోంది. ప్రతిభ ఉన్న విద్యార్థుల ఉన్నత చదువుకు అడ్డంకులు ఎదురుకావొద్దనే ఉద్దేశంతో ప్రభుత్వం జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యాన 'కార్పొరేట్ విద్య' పథకాన్ని అమలు చేస్తోంది. ఈ పథకం కింద విద్యార్థులకు రిజర్వేషన్ల వారీగా సీట్లు కేటాయిస్తారు. ఈ పథకం కింద ఈ నెల 30వ తేదీ వరకు దరఖాస్తుకు అవకాశముంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, బీసీ–ఈ, బీసీ–సీ, ఈబీసీ, మైనార్టీ విద్యార్థులను దరఖాస్తు చేసుకునేందుకు అర్హులుగా ప్రకటించారు. – ఖమ్మం మయూరిసెంటర్

పేద విద్యార్థుల చెంతకు కార్పొరేట్ విద్య

- జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యాన పథకం
- ఎస్సెస్సీలో ప్రతిభ కనబర్చిన వారికి ఇంటర్‌లో ప్రవేశాలు
- ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనార్టీ విద్యార్థుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

కార్పొరేట్ కళాశాలల్లో..

పదో తరగతిలో ప్రతిభ కనపరచిన విద్యార్థులు ఇంటర్మీడియట్ కార్పొరేట్ కళాశాలల్లో చదువుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది. ఎంపికైన ప్రతీ విద్యార్థికి ఫీజు కింద రూ.35 వేలు, ఖర్చుల కింద ఏటా రూ.3 వేలు అందిస్తారు. అలాగే ఉచితంగా వసతి సదుపాయం కల్పిస్తారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాతోపాటు పథకం కింద ఎంపికైన రాష్ట్రంలోని ఏకార్పొరేట్ కళాశాలలో ప్రవేశానికైనా విద్యార్థులు దరఖాస్తు చేసుకునే వీలుంది. ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు ఖమ్మం జిల్లాలో 107, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 161 సీట్లు కేటాయించారు. ఖమ్మం జిల్లాలోని శ్రీ చైతన్య ఆర్ట్స్ అండ్ సైన్స్ జూనియర్ కళాశాల, శ్రీచైతన్య జనరేషన్ క్యాంపస్, కృష్ణవేణి కోఆపరేటివ్ జూనియర్ కళాశాల, రెజొనెన్స్ జూనియర్ కళాశాల, సీవీ.రామన్ జూనియర్ కళాశాల, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కృష్ణవేణి కోఆపరేటివ్ జూనియర్ కళాశాలలు జాబితాలో ఉండగా, విద్యార్థుల ఎంపిక చేసుకున్న కళాశాలల్లో ప్రవేశాలు కల్పిస్తారు.

ఆదాయ పరిమితి..

కార్పొరేట్ కళాశాలల్లో ప్రవేశం పొందాలంటే ఎస్సీ, ఎస్టీ విద్యార్థులైతే తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.2 లక్షలుగా నిర్దేశించారు. బీసీ, మైనార్టీ, ఈబీసీ విద్యార్థులైతే రూ.లక్ష మించకూడదు. విద్యార్థులు దరఖాస్తుతోపాటు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, నాలుగో తరగతి నుంచి పదో తరగతి వరకు స్టడీ సర్టిఫికెట్లు, పదో తరగతి మార్కుల మెమో, ఆధార్, బ్యాంక్ పాస్‌బుక్, దివ్యాంగులైతే ధ్రువీకరణ పత్రం జత చేయాల్సి ఉంటుంది.

ఈ విద్యార్థులకు అవకాశం..

పదో తరగతి వార్షిక పరీక్షల్లో 7 జీపీఏ నుంచి 10 జీపీఏ వరకు సాధించిన విద్యార్థులకు ప్రవేశాలకు అవకాశముంటుంది. ప్రభుత్వ సంక్షేమ శాఖ వసతి గృహాలు, ఆశ్రమ పాఠశాలలు, కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలు, ప్రభుత్వ గురుకులాలు, ప్రభుత్వ పాఠశాలలు, ఎయిడెడ్, నవోదయ పాఠశాలల్లో చదివిన విద్యార్థులకు ఎంపికల్లో ప్రాధాన్యత ఇస్తారు. కేటగిరీల వారీగా ఎక్కువ దరఖాస్తులు వస్తే మార్కుల ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు 'ఈ–పాస్' వెబ్‌సైట్‌లో 'కార్పొరేట్' ఆప్షన్‌ను ఎంపిక చేసుకుని దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి



ప్రభుత్వం పేద విద్యార్థుల కోసం కార్పొరేట్ విద్యా పథకాన్ని అమలు చేస్తోంది. పదో తరగతిలో 7 జీపీఏ, ఆపై మార్కులు సాధించిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. విద్యాబోధనతో పాటు ఉచిత వసతికి అవకాశముంది. పథకం కింద ప్రకటించిన కళాశాలల్లో ఎక్కడైనా చేరేందుకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

–కస్తాల సత్యనారాయణ, ఎస్సీ డీడీ, ఖమ్మం

కులాల వారీగా విద్యార్థులకు కేటాయించిన సీట్లు

జిల్లా	ఖమ్మం		భద్రాద్రి కొత్తగూడెం	
	బాలికలు	బాలురు	బాలికలు	బాలురు
ఎస్సీ	28	18	14	09
మైనార్టీ	03	02	03	02
ఎస్టీ	10	16	45	69
బీసీ	10	07	06	04
బీసీ–బీ	05	03	02	02
ఈబీసీ	03	02	03	02
మొత్తం	59	48	73	88



ఎస్‌ఆర్ అండ్ బీజీఎన్‌ఆర్ అధ్యాపకుడికి డాక్టరేట్


శ్రీనివాసరావు

ఖమ్మంసహకారనగర్/పెనుబల్లి: ఖమ్మంలోని ఎస్‌ఆర్‌అండ్‌బీజీఎన్‌ఆర్ కళాశాల ఫిజిక్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్, పెనుబల్లి మండలం ముత్తగూడెం గ్రామానికి చెందిన నార్సింగ్ శ్రీనివాసరావుకు డాక్టరేట్ లభించింది. కేయూ ఫిజిక్స్ విభాగం విశ్రాంతాచార్యులు డాక్టర ఎస్.కాళహస్తి పర్యవేక్షణలో ఆయన 'ఏ స్టడీ ఆన్ ఫిజికల్ అండ్ కెమికల్ ప్రాపర్టీస్ ఆఫ్ సమ్ ఇరాడియేటెడ్ బయోపాలిమర్స్' అంశంపై సమర్పించిన పరిశోధనా సిద్ధాంత గ్రంథానికి కేయూ నుంచి డాక్టరేట్ ప్రకటించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావును కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మొహ్మద్ జాకిరుల్లా, అధ్యాపకులు అభినందించారు.

హట్యాతండా వాసికి...


విజయలక్ష్మి

కూసుమంచి: మండలంలోని గైగోళ్లపల్లి గ్రామపంచాయతీ శివారు హట్యాతండాకు చెందిన బదావత్ విజయలక్ష్మికి డాక్టరేట్ లభించింది. డాక్టర్ ధర్మానాయక్ పర్యవేక్షణలో 'తెలంగాణ రాష్ట్రంలో మీ–సేవా సర్వీసుల ద్వారా వినియోగదారుల సంతృప్తి' అంశంపై ఆమె సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ ప్రకటించింది. తెలంగాణ ఉద్యమంలో విజయలక్ష్మి భర్త బదావత్ లక్ష్మణ్ చురుగ్గా పాల్గొనగా, డాక్టరేట్ సాధించిన ఆమెను పలువురు పలువురు అభినందించారు.

రెండు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి

ఇద్దరి పరిస్థితి విషమం



కుంజా నాగేంద్రబాబు, సోయం నాగేంద్రబాబు (ఫైల్)


క్షతగాత్రలను అంబులెన్స్ ఎక్కిస్తున్న ఎమ్మెల్యే ఆదినారాయణ

దమ్మపేట: మండలంలోని పార్కలగండి, పట్వారిగూడెం గ్రామాల్లో జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు యువకులు మృతి చెందారు. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని పూసుకుంట జీపీ కటుకూరు గ్రామానికి చెందిన పర్సిక రమేశ్ (30), పూనెం చరణ్ (16) మంగళవారం ద్విచక్రవాహనంపై దమ్మపేటకు బయలుదేరారు. పార్కలగండి గ్రామ సమీపానికి రాగానే ఎదురుగా పాల్వంచ వైపు వెళ్తున్న లారీ వేగంగా వచ్చి బైక్‌ను ఢీకొట్టింది. రమేశ్ కాలు విరిగిపోగా.. చరణ్ తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతిచెందాడు. రమేశ్‌ను 108 ద్వారా దమ్మపేట ప్రభుత్వ ఆస్పత్రికి అక్కడి నుంచి ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి తల్లి సత్యావతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ సాయికిశోర్‌రెడ్డి తెలిపారు. కాగా, గండుగులపల్లి గ్రామానికి చెందిన సోయం నాగేంద్రబాబు (19), గోరం సాగర్(19), గొర్రెగుట్ట గ్రామానికి చెందిన కుంజా నాగేంద్రబాబు(19) ఒకే బైక్‌పై పట్వారిగూడెం మీదుగా దమ్మపేటకు వెళ్తుండగా పాల్వంచ వైపు అతివేగంతో వెళ్తున్న లారీ బైక్‌ను బలంగా ఢీకొట్టింది. యువకులు ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అంబులెన్స్‌తో పాటుగా ఘటనా స్థలానికి చేరుకుని, క్షతగాత్రులను సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ కుంజా నాగేంద్రబాబు మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మిగిలిన ఇద్దరినీ ఖమ్మం తరలిస్తుండగా మార్గమధ్యలో సోయం నాగేంద్రబాబు మృతి చెందాడు. గోరం సాగర్ ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. కుంజా నాగేంద్రబాబు తండ్రి వెంకటేశ్వరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ జితేందర్‌రెడ్డి, ఎస్ఐ సాయికిశోర్‌రెడ్డి తెలిపారు.

రాడ్ తగిలి నిర్మాణ కార్మికుడు...

నిర్మాణంలో ఉన్న వంతెన వద్ద ప్రమాదం

ఖమ్మంఅర్బన్: నగరంలోని ధంసలాపురం వద్ద జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా పనులకు హాజరైన కార్మికుడు గంగా రాజువర్(45) ప్రమాదవశాత్తు తీవ్రంగా గాయపడగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం... పశ్చిమబెంగాల్ రాష్ట్రంలోని బారాజీ అకౌంట్ శాంతిపూర్ నదియాకు చెందిన రాజువర్ ఖమ్మం – దేవరపల్లి జాతీయ రహదారి నిర్మాణ పనుల కోసం వచ్చాడు. ఖమ్మంలో ఉంటున్న ఆయన ధంసలాపురం సమీపాన పనులకు హాజరవుతుండగా సోమవారం కూడా వచ్చాడు. అక్కడ ఇనుపరాడ్లు వేస్తుండగా ప్రమాదవశాత్తు కాలు జారి నిర్మాణంలో ఉన్న బ్రిడ్జి పైనుండి కింద పడ్డాడు. ఈ ఘటనలో ఆయన తలపై రాడ్ పడడంతో బలమైన గాయాలు కాగా, ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ రాజువర్ మంగళవారం మృతి చెందడంతో ఆయన బంధువుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

వరుస మరణాలు

ధంసలాపురం వద్ద మున్నేరుపై జాతీయ రహదారిలో భాగంగా వంతెన నిర్మిస్తున్నారు. ఈ ప్రాంతంలో తీసిన గుంతలో నీరు చేరగా ఇటీవల ఈత కోసం వచ్చిన ముగ్గురు చిన్నారులు మృతి చెందిన విషయం విదితమే. ఇప్పుడు నిర్మాణ కార్మికుడు మృతి చెందడం చర్చనీయాంశంగా మారింది.

చికిత్స పొందుతున్న వ్యక్తి..

పాల్వంచ: అనారోగ్య సమస్యల కారణంగా మనస్తాపానికి గురై పురుగుల మందు తాగిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు.. పట్టణంలోని గట్టాయిగూడెంనకు చెందిన మాలోతు శ్రీను (38) ఈ నెల 16వ తేదీన అర్ధరాత్రి పురుగులమందు తాగగా కుటుంబ సభ్యులు గుర్తించి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం కొత్తగూడెం తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతిచెందాడు. మృతుడి తల్లి సక్రి మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ కేసు నమోదు చేశారు.

రేషన్ బియ్యం తరలిస్తున్న ఆటో సీజ్

సత్తుపల్లిరూరల్: మండలంలోని సదాశివునిపేట నుంచి రేషన్ బియ్యం తరలిస్తున్నట్లు ఆటోను సత్తుపల్లి పోలీసులు మంగళవారం సీజ్ చేశారు. గ్రామం మీదుగా కర్నాటి భద్రం ఐదు క్వింటాళ్ల బియ్యాన్ని ఆటోలో ఆంధ్రాకు తరలిస్తుండగా అదుపులోకి తీసుకున్నారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సత్తుపల్లి పట్టణ సీఐ టి.కిరణ్ తెలిపారు.

కార్మికుడి మృతిపై కేసు నమోదు

ఖమ్మంఅర్బన్: ఖమ్మం కైకొండాయిగూడెంలోని ఒక గ్రానైట్ ప్యాక్టరీలో పని చేస్తున్న కార్మికుడు దొడ్డ శ్రీను(44) ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడగా ఆయన కుమార్తె ఫిర్యాదుతో అనుమానస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు ఖమ్మం అర్బన్ పోలీసులు తెలిపారు. ఖమ్మం పార్శిబంధంకు చెందిన శ్రీను రోజులాగే మంగళవారం తెల్లవారుజామున పనికి వెళ్లాడు. అయితే, ఆయన షెడ్‌లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్.శేషగిరి అనే వ్యక్తి ఫోన్ చేసి కుటుంబీకులకు సమాచారం ఇచ్చాడు. దీంతో తన తండ్రి మృతిపై అనుమానం వ్యక్తం చేస్తూ ఆయన కుమార్తె ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్ పట్టుకొని వ్యక్తి బలవన్మరణం

మోతె: భార్యాభర్తల మధ్య గొడవలతో మనస్తాపానికి గురైన వ్యక్తి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పట్టుకొని బలన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన సూర్యాపేట జిల్లా మోతె మండలం ఉర్లుగొండలో సోమవారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఖమ్మం జిల్లా తిర్మలాయపాలెం మండలం పైనంపల్లికి చెందిన దంపతులైన కంచెం కొమరయ్య(38), రమ నడుమ గొడవలు జరుగుతున్నాయి. దీంతో రమ వారం క్రితం తన ముగ్గురు ఆడపిల్లలను తీసుకొని తల్లిగారింటికి వెళ్లిపోయింది. ఈమేరకు మనస్తాపానికి గురైన కొమరయ్య సోమవారం అర్ధరాత్రి మోతె మండలం ఉర్లుగొండ శివారులో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద తీగలు పట్టుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. మంగళవారం ఉదయం గమనించిన స్థానికులు సమాచారం ఇవ్వగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మోతె ఎస్ఐ యాదవేందర్‌రెడ్డి తెలిపారు.

చింతకానిలో ఒడిశా యువకుడు మృతి

చింతకాని: చింతకాని రైల్వేస్టేషన్ సమీపాన ట్రాక్ పక్కన ఒడిశా రాష్ట్రానికి చెందిన రోహిత్ మింజ్(21) మంగళవారం మృతి చెందాడు. జీఆర్‌పీ ఎస్సై భాస్కర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం... మతిస్థిమితం లేని రోహిత్ మింజ్ ఈనెల 18వ తేదీన అర్ధరాత్రి గుర్తు తెలియని రైలు నుండి చింతకాని రైల్వేస్టేషన్ సమీపంలో జారి పడ్డాడు. స్వల్ప గాయాలతో చుట్టుపక్కల ప్రాంతంలో తిరుగుతున్న ఆయన ఎండ తీవ్రతకు తట్టుకోలేక మృతి చెందినట్లు తెలిపారు. మృతదేహాన్ని అన్నం సేవా ఫౌండేషన్ సభ్యుల సహకారంతో ఖమ్మం ప్రభుత్వాస్పత్రి మార్చురీకి తరలించగా, ఆయన వద్ద లభించిన ఆధారాల ద్వారా ఒడిశా వాసిగా గుర్తించి కుటుంబసభ్యులకు ఇచ్చినట్లు వెల్లడించారు. ఇప్పటికే ఒడిశా రాష్ట్రంలో ఆయన తప్పిపోయినట్లు కేసు కూడా నమోదైందని ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతున్న వృద్ధురాలు...

రఘునాథపాలెం: అనారోగ్య సమస్యలతో పురుగుల మందు తాగిన వృద్ధురాలు చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. రఘునాథపాలెం మండలం రజబ్‌అలీ నగర్‌కు చెందిన బానోత్ రూప్లీ(63) భర్త ఆరు నెలల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. అప్పటి నుండి మద్యానికి అలవాటు పడిన ఆమె కొంత కాలంగా కడుపు నొప్పితో బాధపడుతోంది. ఈ నేపథ్యాన సోమవారం మధ్యాహ్నం పురుగుల మందు తాగగా ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందని, కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పత్తి సాగుకు పదునే అదును

- 60 మి.మీల వర్షపాతం ఉంటేనే నాటడం మేలు
- నేలలకు అనువైన విత్తన రకాల ఎంపిక కీలకం
- పత్తి సాగుపై అధికారుల సూచనలు


చింతకాని మండలం లచ్చుగూడెంలో పత్తి సాగుకు దుక్కి చేస్తున్న రైతు


పత్తి విత్తనాలను నాటుతున్న కూలీలు (ఫైల్)

ఖమ్మంవ్యవసాయం/వైరా : జిల్లాలో సాగయ్యే ప్రధాన పంటల్లో పత్తి ఒకటి. గత ఏడాది జిల్లాలో సుమారు లక్ష ఎకరాలకు పైగా రైతులు పత్తిని సాగు చేశారు. ఈ ఏడాది ఈ సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ అంచనా వేస్తోంది. కొద్ది రోజులుగా వాతావరణంలో మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఉపరితల ఆవర్తనం, ద్రోణి కారణంగా జిల్లాలో వర్షాలు కురుస్తున్నాయి. దీంతో వేసవి దుక్కులు చేస్తున్న రైతులు పత్తి విత్తడానికి సన్నద్ధమవుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో నల్ల నేలల్లో, ఇతర రకాల నేలల్లో రైతులు పొడి దుక్కుల్లో ఏటా మాదిరిగానే ఈ ఏడాది కూడా పత్తి విత్తేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. అయితే, పత్తికి అనువైన మోతాదులో వర్షపాతం ఉండాలి. అప్పుడే మొలకశాతం, పైరు ఏపుగా పెరుగుతుంది. తగిన వర్షపాతం లేకుండా పత్తి విత్తనాలు వేస్తే సరైన మొలక శాతం రాదు. తగిన మోతాదులో వర్షపాతం ఉన్నప్పుడు పత్తిని విత్తుకుంటే మొలకశాతం బాగుంటుందని వైరా కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ రవికుమార్, జిల్లా వ్యవసాయాధికారి ఎం.విజయనిర్మల వెల్లడించారు. ఈ సందర్భంగా పత్తి సాగు చేసే రైతులకు వారు ఇచ్చిన సూచనలు ఇలా ఉన్నాయి.

- పత్తిని జూన్, జూలై నెలల్లో విత్తుకోవచ్చు. వర్షపాతం ఆధారంగా జూలై 20వ తేదీ వరకు విత్తుకోవచ్చు. జూలై 20 తరువాత విత్తితే దిగుబడి తగ్గే అవకాశముంది.
- ఒకటి, రెండు తేలికపాటి వర్షాలు పడగానే తొందరపడొద్దు.
- కనీసం 60 మి.మీల వర్షపాతం నమోదయ్యాకే పత్తి గింజలను నాటితే వంద శాతం మొలక వస్తుంది.
- రైతులు తమ ప్రాంతానికి అనువైన బీటీ విత్తనాలను అనుభవంపై ఎంచుకోవాలి. అవి కూడా ఒకటే రకం కాక రెండు నుంచి మూడు రకాల విత్తనాలను ఎంచుకుంటే మంచిది.
- వర్షాధారంగా సాగు చేస్తే త్వరగా పూతకొచ్చే రకాలు, నీటి వసతి ఆధారంగా సాగుకు మధ్యస్తంగా, ఆలస్యంగా పూతకు కాతకు వచ్చే రకాలను ఎంపిక చేసుకోవాలి.
- బీటీ విత్తనాలు ఎంపిక చేసుకునే రైతులు మేలైన యాజమాన్య పద్ధతులను పాటించాలి. నేల స్వభావాన్ని దృష్టిలో పెట్టుకొని 40 లేదా 42 అంగుళాల అచ్చు వేసుకొని విత్తితే మంచి దిగుబడి సాధించవచ్చు.
- తేలిక నేలల్లో అధిక సాంద్రత పద్ధతిలో పత్తిని 36x6 అంగుళాల దూరంలో లేదా దగ్గరగా సాగు చేసే పద్ధతిలో 36x12 అంగుళాల దూరంలో విత్తుకోవాలి. అధిక సాంద్రత లేదా దగ్గరగా సాగు చేసే పద్ధతికి అనువైన వంగడాలను ఎంచుకుంటే మంచి దిగుబడి వచ్చే అవకాశం ఉంది. అంతేగాక రెండో పంట కూడా సకాలంలో విత్తుకోవచ్చు.
- పత్తి గింజలు విత్తిన 48 గంటల్లో తేమ ఉన్నప్పుడు పిండిమిథాలిన్ 1.2 మి.లీ ఎకరాకు పిచికారీ చేసుకుంటే కలుపు ఉధృతి తగ్గుతుంది.
- వాతావరణ శాఖ జారీ చేసే ముందస్తు వాతావరణ సూచనలను తెలుసుకొని పత్తి విత్తనాలను విత్తుకుంటే మంచి మొలకశాతం, ఉత్తమ దిగుబడులు ఉంటాయి.

రుణమాఫీ ఆలస్యం చేసేందుకు పన్నాగం

ఎమ్మెల్సీ తాత మధుసూదన్


సమావేశంలో మాట్లాడుతున్న మధు, పక్కన నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: అధికారంలోకి వచ్చి 150 రోజులైనా వాగ్దానాలను అమలు చేయలేని కాంగ్రెస్ ప్రభుత్వం రోజుకో పన్నాగం పన్నుతోందని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాత మధుసూదన్ విమర్శించారు. ఖమ్మంలోని బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ పాలనకు, ఇప్పటికి రైతుల పరిస్థితి ఎలా ఉందో ప్రజలు గమనిస్తున్నారన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతులకు రైతు బంధు వేస్తుంటే ఎన్నికల పేరుతో అడ్డుకున్న కాంగ్రెస్ లోక్‌సభ ఎన్నికల్లో వ్యతిరేకతను తగ్గించుకునేందుకు నగదు జమ చేసిందని తెలిపారు. ఇక రైతు రుణమాఫీ విషయంలో తాత్సారం చేసేందుకు కార్పొరేషన్ ఏర్పాటు పేరిట కొత్త పన్నాగం పన్నారని పేర్కొన్నారు. ధాన్యానికి బోనస్ విషయంలోనూ మాట మార్చారని విమర్శించారు. కాగా, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో రైతు బిడ్డ, విద్యావంతుడైన ఏనుగుల రాకేష్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని మధు కోరారు. అంతేతప్ప పెద్ద సంఖ్యలో కేసులు ఉన్న కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు ఓటు వేసి హుందాతనం కలిగిన పెద్దల సభకు పంపించొద్దని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో డీసీసీబీ మాజీ అధ్యక్షుడు కూరాకుల నాగభూషణం, నాయకులు వీరూనాయక్, బెల్లం వేణు, డోకుపర్తి సుబ్బారావు, పగడాల నరేందర్, కె.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

11నెలల బాలుడి అదృశ్యం..

- కిడ్నాప్ చేసినట్లు అనుమానాలు
- దర్యాప్తు చేపట్టిన పోలీసులు


సాయి దేవాన్ష్

సత్తుపల్లి: సత్తుపల్లి పట్టణంలో 11 నెలల బాలుడు అదృశ్యం కలకలం రేపింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ జయమ్మ కాలనీకి చెందిన వాణరాసి జంపన్న – దుర్గ దంపతులు వారం క్రితం వచ్చి సత్తుపల్లి పట్టణ శివారు గుడిపాడులో గుడారాలు వేసుకొని నివాసముంటున్నారు. ఇంటింటికీ తిరిగి గ్యాస్ స్టౌలు, మిక్సీలు బాగు చేసే వీరు, తమ కుమారుడు సాయిదేవాన్ష్‌తో కలిసి సోమవారం రాత్రి నిద్రించారు. అయితే, అర్ధరాత్రి 12.30 గంటల సమయాన చూసేసరికి బాలుడు లేకపోవడంతో జంపన్న దంపతులు ఎక్కడ వెతికినా ఆచూకీ కానరాలేదు. కాగా మూడు, నాలుగు రోజుల నుంచి గుడారాల సమీపాన రాత్రి వేళ ఒక కారులో కొందరు వచ్చివెళ్తుండగా, వారే బాలుడిని కిడ్నాప్ చేశారని సందేహం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యాన సత్తుపల్లి పట్టణ సీఐ టి.కిరణ్ ఆధ్వర్యాన సమీప ప్రాంతాల్లోని సీసీ కెమెరాల పుటేజీని పరిశీలించారు. అంతేకాక బాలుడి ఆచూకీ కనుగొనేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు సీఐ తెలిపారు. కాగా, బాలుడు సాయి దేవాన్ష్ కానరాకుండా పోవడంతో ఆయన తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.